

# సొంతిల్లు

ఎల్. మాలకొండయ్య

**నాగమ్మ**, ఎంకయ్య వినుకొండ తాలూకాలో ఒక చిన్న గ్రామంలో ఉండేవాళ్ళు. వర్షాలు లేక, కరువులో పనులు దొరక్క హైదరాబాద్ చేరుకున్నారు. చుట్టుపక్క వాళ్ళు చాలా మంది మట్టి పని, మరి ఇతర కూలీ పనులకు హైదరాబాద్ వెళ్ళడం విని, ఆశతో పొట్ట గడుపుకోవడానికి వాళ్ళు హైదరాబాద్ చేరారు. చేతిలో ఉన్న అయిదు రూపాయలు ఒక మేస్త్రీ జేబులో పెట్టి ఎక్కడైనా కూలి పని చూపమన్నారు. వాళ్ళ అదృష్టమా అంటూ ఒక అధికారి మేడ పూర్తి కాక ఆగిపోయిన చోట వీళ్ళకు పని కుదిర్చాడు ఆ మేస్త్రీ. అక్కడ పని దాదాపు రెండు నెలలు మాత్రమే. ఆ ఇంటి ఇల్లాలు దయతో నాగమ్మను, ఎంకయ్యను తన ఇంట్లో పనివాళ్ళ కని కట్టించిన గదిలో ఉండ మని ఆశ్రయ మిచ్చింది. దాంతో అద్దె ఖర్చు లేకుండా నాగమ్మ, భర్త జీవితం గడుపుకుంటూ, కూలీలో కొంత డబ్బు అమ్మగారి దగ్గర దాచుకుంటూ వచ్చారు. ఆ అధికారి ఇంటిపని పూర్తి కాగానే నాగమ్మ, ఎంకయ్య భయపడ్డారు—ఎక్కడ వెళ్ళిపొమ్మంటారో ఆ గది ఖాళీ చేసి అని. కాని ఆ ఇల్లాలు దయ గలది కనక వేరే ఎక్కడ పని చేసుకున్నా నాగమ్మ, తన మొగుడు ఆ గదిలోనే ఒండుకు తింటూ, తమ ఇంటి పట్టు ఉండవచ్చుని చెప్పింది. దాంతో వాళ్ళకు కొంత ధైర్యం వచ్చి ఒక గండం తప్పిందని ఆయమ్మకు నమస్కారాలు పెట్టారు. కాని రెండు మూడు రోజులు ఎక్కడా పని దొరక లేదు. ఆ ఇల్లాలు వాళ్ళ ఇబ్బంది చూచి ఇంకా నాలుగు రోజులు నాగమ్మకు పప్పు, దంపుడు, ఉప్పు మిరపకాయల ఎండపెట్టి బాగు చేయడం వగైరా పనులు కల్పించి నాలుగు రూకలు కూలీ ఇచ్చింది. ఈ లోగా ఎంకయ్య పది చోట్ల తిరిగి తనకు భార్యకు కూలి పని వెతుక్కున్నాడు.

ఆ పనికి మూడు మైళ్ళు నడిచి వెళ్ళాలి కనక ఉదయం 6 గంటలకే లేచి వెళ్ళి, రాత్రి 7 గంటలకు వచ్చేవాళ్ళు. దాంతో నాగమ్మ ఆ ఇల్లాలికి ఏదైనా ధాన్యం దంచి పెట్టడమో, గిన్నెలు తోమడమో కూడా వీలుగాక పొయ్యేది. ఒక్కొక్క రోజు చాలా పొద్దు పొయ్యేది, వాళ్ళు పని నుండి తిరిగి వచ్చేటప్పటికి. ఆ ఇల్లాలు రాత్రి నిద్ర పోయే ముందుకి నాగమ్మను పలకరించేది. ఒకరోజు—"ఏమి నాగమ్మ! ఇంకా భోజనం చెయ్యలేదా" అంది.

"లేదమ్మగారూ. ఈ పూట ఆలస్యమైంది. పొయ్యిమీద బువ్వ పెట్టాను. మా ఆయన ఉలిపాయ, మిరపకాయ తేవడానికి పోయిండు" అంది.

ఈ వేళ కాడ అంగళ్ళుంటాయా. ఇదో నేను చారు, పచ్చడి ఇస్తాను, భోజనం చెయ్యండి అంది. ఈ లాగే అప్పుడప్పుడు కూరలు ఇస్తూ ఉండేది, ఆవిడ. అలాంటప్పుడల్లా ఎంకయ్య, నాగమ్మ పండగలా భోజనం చేసే వాళ్ళు. సద్ది అన్నం, పాత బట్టలు అప్పుడప్పుడు ఇస్తుండేది. అమ్మగారిచ్చిన చీర కట్టుకున్నప్పుడు నాగమ్మ బొమ్మలా గుండేది. అబ్బో అమ్మగా రిచ్చిన సీర గట్టుకోని దొరసానిలా కులుకుతుండావు, ఇయ్యాల పనిలోకి వస్తావా, రావా? అనేవాడు ఎంకయ్య. "ఉండు మావా, నువ్వెట్టాగు కానియ్యవు కొత్త బట్టలు. అమ్మగా రిచ్చిన పాత చీరైనా కట్టుకోనియ్యి. పేరుకు పాతదే కాని, ఎక్కడైనా చినుగుందేమో చూడు మావా" అంటూ పైట చెంగు ఎత్తి చూపేది నాగమ్మ.

పెళ్ళయి ఏడేళ్ళు అయినా ఎంకయ్యకు ఇంకా పిల్లల్లేరు. వూళ్ళో ఇంటి దగ్గర తల్లిదండ్రి లేరు. అన్న వదిన ఉన్న ఎకరా పొలంతో, కౌలుకు మరోక ఎకరా తీసుకొని సేద్యం చేసుకుంటున్నారు. అందువల్ల వూరికి డబ్బు పంపాలసిన అవసరం లేదు ఎంకయ్యకు.

హైదరాబాద్‌లో సంవత్సరం గడిచేటప్పటికి దాదాపు ఎనిమిది వందల రూపాయలు దాచుకో గలిగారు మొగుడు, పెళ్ళాం. ఈ లోగా ఆడవాళ్ళు నాగమ్మ చెవిలో — "నాయకుడు రామయ్య కూలీ లందరికి చౌకగా ఇళ్ళ స్థలాలు అమ్మి పెడుతున్నాడు" అని చెప్పారు. దాంతో ఎంకయ్యను వెళ్ళి అన్ని వివరాలు కనుక్కు రమ్మంది నాగమ్మ. ఆదివారం నాడు ఇద్దరూ ఇంట్లో ఉన్నప్పుడు నాగమ్మ అమ్మగారితో అంది "అమ్మా! వూరి ఎలపట కూలీల నాయకు డంట—రామయ్యగారంట—ఇళ్ళ స్థలం తలకు నాలుగు వందల రూపాయలు తీసుకుని ఇస్తాడంట. మా ఆయన ఎళ్ళి వివరాలన్ని తెలుసుకోని వచ్చాడు. మీరు సరే అంటే ఒక తలం మేము కొనుక్కుని ఇల్లేసు కుంటాము, తల్లీ!" అంది.

"ఏమి నాగమ్మ, మా ఇంట్లో ఉండటం ఇష్టం లేదా" అంది ఇంటావిడ. "అది కాదు, తల్లీ! ఎంత కాలం అని తమ దగ్గర వూరికే ఉంటాము. అందరికీ ఇబ్బంది. "ఏమి మీకూ పిల్లలకు గది చాలటం లేదా" అంది ఆమె. "కాదు తల్లీ! పిల్లలు ఇప్పుడు లేక పోయినా తరవాత అయినా కొంత డబ్బు పోగు చేసుకున్నాం గదా, ఒక సొంత కొంప ఏసుకుని ఈ వూళ్ళోనే ఉండి పోతాం ,తల్లీ" అంది.

"అయితే నాలుగు వందలు కావాలంటావు ఇదిగో తీసుకో. మీరు దాచుకున్న డబ్బుకూడా ఉంది నా దగ్గర" అంది. అది కావలసినప్పుడు తీసుకుంటా తల్లీ అని, ఆ నాలుగు వందల రూపాయలు ఎంకయ్య చేతికిచ్చి పంపింది నాగమ్మ.

సాయంత్రానికి దిగులు ముఖంతో వచ్చి, "ఇంకా ఆరు వందలు కావాలంట. ఎవరికో రు. 200 అంచ మివ్వాలంట, రు 400 లు భూమి గల్లాయనకు, రు 400 లు. నాయకుడికి కావాలట. మొత్తం ఎయ్యి రూపాయలు గావాలంట."

"ఎయ్యి రూపాయలే" అని గుడ్లు తేల వేసింది నాగమ్మ. అమ్మగారి దగ్గర నాలుగు వంద లేగా ఉంది మన డబ్బు.

"పోనీ అమ్మగార్ని ఆరెండు వందలుకూడా అడుగే, మనకు సొంతిల్లు దొరుకుతుందంటే ఆ తల్లి ఇస్తది."

"మరి ఇల్లు కట్టుకోడానికో?" అంది. దాని కొక ఎయ్యి రూపాయ ల వుద్ది. అమ్మగారికి దాసీ పని చేసైనా తీర్చుకోలేమా? అదికూడా ఆ తల్లినే అడుగు" అన్నాడు. నాగమ్మ గుండె ధైర్యం చేసుకుని అమ్మగార్ని అడిగింది. "ఇంత డబ్బు వాళ్ళను నమ్మి ఎలా ఇస్తారు" అంది ఆమె. "నాయకుడు మంచో డంటమ్మా. అందరు ఇస్తున్నారు. సొంతిల్లు గట్టుకున్నాక నెల నెలకు మీ బాకీ తీరుస్తాం తల్లీ. నీ మేలు మరువలేము. చచ్చి మల్లీ నీ కడుపున పుడతాం అమ్మా" అని వేడుకుంది.

ఆ ఇల్లాలు వాళ్ళ మీద దయతో, నమ్మకంతో వాళ్ళడిగిన మొత్తం ఇచ్చి. "జాగ్రత్త, మోస పొయ్యేరు" అని చెప్పింది.

"వూరందరు మోసపోతే కదా మనం మోస పొయ్యేది" అన్నాడు భార్యతో ఎంకయ్య.

"అందరు మోసపోతే మన కొచ్చే దేమిటి?మనం మోసపోకుండా చూసుకోవాలి గాని."

ఎంకయ్య డబ్బు తీసికెళ్ళి ఇచ్చాడు. స్థలం కొన్నాడు. కష్ట పడి ఇల్లు వేసుకున్నాడు. సంతోషంగా ఇంటకి చేరడానికి ఏర్పాటు చేసుకుని అమ్మగారికి నమస్కారం చేసి సెలవు తీసుకున్నారు. అమ్మగారు ఒక కొత్త వంట పాత్రకూడా కొని ఇచ్చింది. అమ్మగారిచ్చిన గది ఖాళీ చేసి సొంతింటికి ప్రయాణ మవుతుంటే, కబురొచ్చింది. "పోలీసులొచ్చి మన కొంపలన్నీ కూల కొట్టారు. అందర్నీ లాఠీలతో కొట్టి ఖాళీ చేయించారు" అని, చెప్పాడు పక్క గుడిసె సుబ్బయ్య తల మీద రక్తం కారుతూ. ★

